Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10

శుక్రవారం, జూలై 18, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## నేడు బెంగాల్, బిహార్‌లో ప్రధాని పర్యటన

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నేడు ప్రధాని మోదీ పర్యటించి రూ.5,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని దుర్గాపూర్ పట్టణంలో బీజేపీ చేపట్టిన భారీ ర్యాలీలోనూ ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్-మే కాలంలో పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 21వ తేదీన కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలో అమరవీరుల దినోత్సవ ర్యాలీ జరగనున్న నేపథ్యంలో అంతకుముందే మోదీ రాష్ట్రంలో పర్యటిస్తుండటం గమనార్హం. "బిహార్ నుంచి ప్రధాని మోదీ శుక్రవారం దుర్గాపూర్‌కు చేరుకుంటారు. తొలుత వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ప్రాజెక్టుల కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారు. తర్వాత పార్టీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు"అని బెంగాల్ బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు.



# నదీ జలాల విషయంలో ఏపీతో చర్చించొద్దా?

- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- నదీ జలాల విషయంలో భారత్-పాకిస్తాన్ మధ్యే చర్చలు
- కృష్ణా, గోదావరి జలాలపై మేం చర్చిస్తే తప్పేంటి?
- గతంలో చంద్రబాబుతో కేసీఆర్, హరీశ్‌రావు చర్చించలేదా?
- కేంద్రం చర్చకు పిలిస్తే ఢిల్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కు రావాలా?
- నీళ్ల ద్రోహి కేసీఆరే.. పదేళ్లలో కృష్ణాలో 1200 టీఎంసీలు పోనిచ్చిండు
- కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం.. కొట్లాట నా చివరి అస్త్రం
- కేంద్రంతోపాటు ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం
- కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్ .. సెప్టెంబర్ లోగా స్థానిక ఎన్నికలు
- రెండేళ్ల తర్వాతే నామినేటెడ్ చైర్మన్ల నియామకం ఉంటుందని వెల్లడి

**సినిమాల్లో విలన్లను ఆఖర్లో చంపుతారు.. 'కాళేశ్వరం' విషయంలోనూ మెల్లగా అరెస్టులు**

న్యూఢిల్లీ: 'నదీ జలాల విషయంలో భారత్-పాకిస్తాన్ మధ్యే చర్చలు జరుగుతున్నాయి. నీటి పంపకాలపై రెండు దేశాలు మాట్లాడుకుంటున్నాయి. అలాంటప్పుడు కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన అంశాలపై పొరుగు రాష్ట్రంతో మేం చర్చిస్తే తప్పేంటి. నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చర్చలే వద్దన్న తరహాలో బీఆర్ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. 2015%-%16లో చంద్రబాబునాయుడుతో చర్చలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ వెళ్లలేదా? ఇప్పుడు మేము వెళితేనే నొప్పొచ్చిందా?. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగాలి. మేము రాజకీయంగా బతకాలన్నది వారి కోరిక. అందుకే మా భేటీపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. కేంద్రంతో కలిసి పనిచేసేందుకు కూడా మాకెలాంటి అభ్యంతరం లేదు. నేనెవరికీ భయపడను. కేవలం సిస్టమ్‌కు మాత్రమే భయపడే వ్యక్తిని. నా ప్రాధాన్యత రాష్ట్రం. సమస్య ఉంటే చర్చలతో పరిష్కరించుకుంటా. కొట్లాట నా చివరి అస్త్రం. ఇదే ధోరణిలో కేంద్రంతో పాటు పక్క రాష్ట్రం ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం. కొట్లాడుకుంటూ పోతే పాలకులకు కాదు, ప్రజలకు నష్టం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాల అంశంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన సీఎం గురువారం తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. పలు అంశాలపై వివరంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

**కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే..**

కేంద్ర జలశక్తి మంత్రి వద్ద సమావేశంలో బనకచర్లపై చర్చ జరగలేదు. జలశక్తి శాఖ తన ప్రకటనలో కూడా అదే చెప్పింది. ఆ భేటీ భవిష్యత్ కార్యాచరణకు రోడ్‌మ్యాప్ వంటిది. మేం పూర్తిగా కేంద్రానికి సహకరిస్తాం. వారి సహకారం తీసుకుంటాం. కలిసి పనిచేస్తాం. నిధులైనా, అనుమతులైనా అడగకపోతే ఎవరూ ఇవ్వరు. కాబట్టి అడిగి తీసుకుంటాం. కేంద్రం పిలిస్తే మీరెందుకు వెళ్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర పిలిస్తే ఢిల్లీకి రాకుండా, ఫాంహౌస్‌కు రావాలా? కేంద్రం వద్ద వాదన వినిపించకుండా, ఫాంహౌస్‌లో వాదించాలా? కేసీఆర్‌తో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు,

(మిగతా 2వ పేజీలో)



## సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వండి
- ఖాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి



# చంద్రబాబు స్క్రిప్టు.. రేవంత్ చిలక పలుకు

- తెలంగాణను చంద్రబాబుకు గురుదక్షిణగా ఇచ్చిన సీఎం
- ఢిల్లీలో తెలంగాణ జలాలను ఏపీకి తాకట్టు పెట్టారు
- పిరికిపందలా ఢిల్లీకి వెళ్లి చిట్‌చాట్‌లతో నాపై దుష్ప్రచారం
- నాపై డ్రగ్స్ కేసు ఉన్నట్లు దమ్ముంటే నిరూపించు
- రేవంత్.. క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలు : కేటీఆర్

సిరిసిల్ల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తొత్తుగా మారారని, తెలంగాణ ప్రయోజనాలను గురుదక్షిణగా తాకట్టు పెట్టేందుకు చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. ఇక్కడ మాట్లాడుతున్న చిలక రేవంత్‌రెడ్డి అయితే పలుకులు మాత్రం చంద్రబాబువని మండిపడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా జరిగిన జలదోపిడీ ఒక ఎత్తయితే సీఎం రేవంత్‌రెడ్డి కోవర్టుగా మారి ఢిల్లీలో బుధవారం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఒక ఎత్తు అని ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చ పెడితే సమావేశానికే వెళ్లను అని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఎలా మీటింగ్‌కు పోయారని ప్రశ్నించారు. అసలు ఆదిత్యనాథ్‌ను సాగునీటి సలహాదారుగా పెట్టుకోవడమే పెద్ద తప్పు అన్నారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వొద్దని అడ్డుకున్నదే చంద్రబాబు నాయుడు అని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రైతుల హక్కులను కాపాడడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నారని స్పష్టం చేశారు. బనకచర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే మరోసారి ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తోందని, తెలంగాణ జలవనరులను దోపిడీ చేయాలని చూస్తున్నారని

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ హక్కులను బాబు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు: కవిత

2లో

# జనం దృష్టి మళ్లించడానికే కెటిఆర్‌పై ఆరోపణలు

**::: మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు**

హైదరాబాద్:బనకచర్ల పైన నగ్నంగా దొరికిపోయిన సిఎం రేవంత్‌రెడ్డి, విషయాన్ని పక్కదారి పట్టించేందుకు తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్టు ఎజెండాలో ఉన్నదని ఎపి మంత్రి చెబితే, రేవంత్ రెడ్డి ఏమో బనకచర్ల అసలు చర్చకు రాలేదని అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి చీకటి బాగోతం కప్పిపుచ్చుకునేందుకు బజారులోని చెత్త అంతా మీడియా ముందు ఉంచారని అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం హరీష్‌రావు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా కెటిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.కెటిఆర్ సవాల్ విసిరితే చర్చకు రాని రేవంత్‌రెడ్డి డ్రగ్స్, గంజాయి అంటూ మోకాళుకు బోడి గుండుకు ముడి పెట్టే

(మిగతా 2వ పేజీలో)





## బండి సంజయ్‌కు సిట్ నోటీసులు



## హైదరాబాద్‌లో పలు చోట్ల కుండపోత

# ఓఆర్ఆర్ లోపల కల్లు దుకాణాలు బంద్!

- సొసైటీల పరిధిలో 454 దుకాణాల ఎత్తివేత, టీఎఫ్‌టీ లైసెన్స్‌లు రద్దు
- ఎక్సైజ్ శాఖ నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం?
- కల్తీ కల్లును అరికట్టడానికి అధికార యంత్రాంగం సూచన!



హైదరాబాద్: కల్లుపై నిషేధాన్ని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి మొత్తం ప్రాంతాన్ని చేర్చాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ నుంచి పూర్తి వివరాలను తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ కల్లు దుకాణాలకు అవసరమైన చెట్లు లేకపోవడం వల్ల వ్యాపారులు అల్ప్రాజోలమ్ వినియోగించి కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు అధికారవర్గాలు కూడా వెల్లడిస్తున్నాయి. ఈ మధ్య కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి 10 మంది మరణించడం ఎక్సైజ్ శాఖను కుదిపేసింది. ఈ వ్యవహారంలో కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నా.. కల్తీ కల్లు కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తప్పదన్న నిశ్చితాభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. ఔటర్ రింగ్ రోడ్డులోపల ఎన్ని దుకాణాలు ఉన్నాయ న్న సమాచారంతో పాటు దానిపై ఆధారపడి ఉన్న వారి వివరాలను కూడా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు

(మిగతా 2వ పేజీలో)

# నదీ జలాల విషయంలో ఏపీతో చర్చించొద్దా?

ఆయన నాకు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే. ఆయనతో ఏ అంశంపై అయినా చర్చకు సిద్ధమే.

**అన్నీ అధ్యయనం చేశాకే 'ఇచ్చంపల్లి'..**

కేంద్ర ప్రభుత్వమే గోదావరి–కావేరి నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్ ప్రతిపాదనను ఇచ్చిం ది. తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేదైతే ఈ లింక్‌పై చర్చిస్తామని కేంద్రానికి చెప్పాం. ఎప్పుడో తయారు చేసిన డీపీఆర్ ప్రకారం అయితే దీనికి ఒప్పుకునేది లేదు. అది తయారయ్యాక ఎగువ రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులు వచ్చేశాయి. కాబట్టి ప్రస్తుతం నీటి లభ్యత ఎంత ఉందో తేలాలి. వందేళ్ల రాష్ట్ర అవసరాలకు సరిపడా నీటి లభ్యత, అవసరాలు అన్నీ అధ్యయనం చేశాకే ముందుకెళ్తాం తప్ప గుడ్డిగా వ్యవహరించం.

**400 టీఎంసీలు చాలన్నది కేసీఆరే..**


నీళ్ల ద్రోహి కేసీఆరే. 2004–2014 వరకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు 4.1 టీఎంసీల చొప్పున నీళ్లు తరలించుకుపోతే, 2014–23 మధ్య ఆ సామర్థ్యన్ని ఏకంగా 9.6 టీఎంసీలకు పెంచనిచ్చిం ది కేసీఆరే. అంతకుముందు ఉమ్మడి ఏపీలో పదేళ్లలో 727 టీఎంసీలు ఏపీ తరలించుకుపోతే, బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ఏకంగా 1,200 టీఎంసీల నీటిని ఏపీకి పోనిచ్చాడు. దీన్నిబట్టి నీళ్ల ద్రోహి ఎవరో తెలుస్తోంది. మరోవైపు 2023లో కృష్ణా జలాల్లో 400 టీఎంసీలు చాలు అన్నది కేసీఆరే. గోదావరిలో 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయి. వాటిని వాడుకోండని ఏపీకి చెప్పింది ఆయనే. చేపల పులుసు తిని అది అరిగేదాకా కూడా ఆగకుండా నీళ్లు వాడుకోమని చెప్పారు. ఇదే సమయంలో 'కాళేశ్వరం' కూలిపోతే ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. మేం ఒక్కొక్కరిపై చర్యలు తీసుకుంటున్నాం. సినిమాల్లో విలన్లను ఆఖరిలో చంపినట్లు ఇక్కడా మెల్లిగా అరెస్టులు జరుగుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ అరెస్టు చివర్లోనే జరిగింది కదా.

**42% రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేక వ్యూహం**

2014కు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 23 శాతానికి తగ్గించారు. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చి బీసీలకు అన్యాయం చేశారు. ప్రస్తుతం 50 శాతం క్యాప్‌ను ఎత్తివేస్తున్నాం. 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మాకు ప్రత్యేక వ్యూహం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం. కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు పెడతాం. అందుకే ఆర్డినెన్స్, మిగతా ప్రక్రియపై దృష్టి పెట్టాం. గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించాక, తెలంగాణలో రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడాలి. రాష్ట్రంలో రెండేళ్ల తర్వాతే కొత్త నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ఇస్తాం. అప్పటివరకు ప్రస్తుత కార్పొరేషన్లకు డైరెక్టర్లు, సభ్యులను భర్తీ చేస్తాం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా పోటీ చేస్తుంది.

**లోకేశ్‌ను కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిసినట్లు?**

'నేను అధికారికంగా చర్చలో పాల్గొంటే తప్పు అంటున్నారు. మరి ఇటీవల ఏపీ మంత్రి



నారా లోకేశ్‌ను కేటీఆర్ ఎందుకు కలిశాడు?, చీకట్లో కలవాల్సిన అవసరం ఏముంది?. లోకేష్‌తో భేటీ అయిన మాట వాస్తవం కాదా? చెప్పమనండి..' అని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. లోకేశ్‌ను కలిసినట్లు మీకెలా తెలిసింది? మీరు కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని ఆయన అన్నారు. ఆ విషయాన్ని మాకు కళ్ల ముందు ఉన్న వ్యక్తులే చెప్పారని తెలిపారు.

**కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్**

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్ అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'ఆ గంజాయి బ్యాచ్ సవాల్ విసిరితే నేను స్పందించాలా? కేటీఆర్ బిజినెస్ భాగస్వామి కేదార్‌ రకరకాల డ్రగ్స్ వాడి దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. లిక్కర్‌లో కాక్‌టెయిల్ విన్నాం..కానీ ఇక్కడ గంజాయి, డ్రగ్స్ కాక్‌టెయిల్ అని వింటున్నాం. అతని ఫోరెన్సిక్ రిపోర్టును తెప్పించాం. సందర్భాన్ని బట్టి మీడియా ద్వారా బయటపెడతాం. అవసరమైతే అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమే. ఆయన బావమరిది ఫాంహౌస్‌లో సమీప గ్యాంగ్ అంతా గంజాయి, డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డారు. ఇలా కేటీఆర్ చుట్టూ ఉన్న వాళ్లంతా గంజాయి బ్యాచే..' అని సీఎం ఆరోపించారు.

**మిగిలింది కేటీఆరే..**

మున్సిపల్ శాఖలో అక్రమాలకు సంబంధించి కీలక అధికారి బాలకృష్ణ అరెస్టు అయ్యారని, ఇక మిగిలింది కేటీఆర్ మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. గతంలో నా ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిన కిషన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు? కొత్తగా ఫోన్ ట్యాపింగ్ కేసు కేంద్రానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏడాదిన్నరగా ప్రభాకరావును కాపాడింది ఎవరు? ఇదే బీజేపీ, బీఆర్ఎస్ కాదా?..' అని రేవంత్ ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో పలు చోట్ల కుండపోత

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో భారీ వర్షం పడే అవకాశం ఉందని నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని గురువారం (జూలై 17)సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అధికారుల్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్(జీహెచ్ఎంసీ) అప్రమత్తం చేసింది. నగరానికి భారీ వర్ష సూచన అన్న అప్‌డేట్ వచ్చిన కాసేపటికే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు చోట్ల భారీ వర్షం పడింది. పలు చోట్ల కుండపోత వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, మూసాపేట్, సనత్‌నగర్, ఎర్రగడ్డలో కుండపోత వర్షం పడగా, కూకట్‌పల్లి, బాలానగర్, మాదాపూర్‌లో భారీ వర్షం పడింది. గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీలో సైతం భారీ వర్షం పడింది. భారీ వర్షం పడే అవకాశం ఉందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసిన నేపథ్యంలో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లేవారిలో ఆందోళన మొదలైంది. ఆఫీస్ షిఫ్ట్‌లు ఐదు గంటలకు ముగిసే వారు ఆగమేఘాల మీద ఇళ్లకు బయలుదేరారు.





# సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

న్యూఢిల్లీ: రాష్ట్రంలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివద్ధి కేంద్రాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. అందువల్ల ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ప్రాజెక్టు, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్టు క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు. రెండురోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన సీఎం..గురువారం రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద తెలంగాణ ఇచ్చిన వినతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. రీజినల్ రింగు రైలుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని..ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. రూ.8 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. 'రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది..'అని చెప్పారు. హైదరాబాద్ డ్రైపోర్టు నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉ త్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందన్నారు. ఖాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు అంశాన్ని సీఎం రేవంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఖాజీపేట రైల్వే డివిజన్ అవసరమని తెలిపారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవల కోసం దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల కోసం.. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్‌కృష్ణా (122 కి.మీ.అంచనా వ్యయం రూ.2,677 కోట్లు) కల్వకుర్తిమాచర్ల (100 కి.మీ.అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్‌గద్వాల (296 కి.మీ.అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్‌మిర్యాలగూడ (97 కి.మీ.అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

# జనం దృష్టి మళ్లించడానికే కెటిఆర్‌పై ఆరోపణలు

ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి లాగా కెటిఆర్ బ్యాగులు మొయ్యలేదని, ఆయన విదేశాలలో ఉన్నత చదువుకుని తెలంగాణ ప్రతిష్టను జాతీయ, అంతర్జాతీయ వేదికలలో నిలబెట్టారని తెలిపారు. కానీ రేవంత్‌రెడ్డి కెటిఆర్‌ను తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరో దుబాయిలో చనిపోతే తమకేం సంబంధం..? అని ప్రశ్నించారు. సిఎం చుట్టూ ఉన్నవారు బ్యాగులు మోసేవారని, పరిపాలన అంటే బ్యాగులు మోసుడు కాదు అని పేర్కొన్నారు. సిఎం రేవంత్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో లేదా కమాండ్ కంట్రోల్ బిల్డింగ్‌లోనే పాలన చేస్తున్నావని విమర్శించారు. రోజూ ప్రజలను కలుస్తా అని చెప్పిన రేవంత్‌రెడ్డి సచివాలయానికి ఎందుకు పోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి బానిస మనస్తత్వం పోవడంలేదని హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుకు కోపం వస్తుందని రేవంత్ రెడ్డి జై తెలంగాణ అనడం లేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి అని, ముఖ్యమంత్రి అయిన తరువాత జై తెలంగాణ అంటాడేమో అనుకున్నామని అన్నారు. కర్ణాటక సిఎం జై కర్ణాటక, మహారాష్ట్ర సిఎం జై మహారాష్ట్ర అని అంటున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ జై హింద్ అంటున్నారని చెప్పారు. తెలంగాణకు వచ్చినప్పుడు మల్లికార్జున్ ఖర్గే కూడా జై తెలంగాణ అన్నారని, కానీ రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనడం లేదని విమర్శించారు.

**ఏం చేసినా కెసిఆర్‌కు ఉన్న ఇమేజ్ రేవంత్ రెడ్డికి రాదు**

సిఎం రేవంత్‌రెడ్డి లైయింగ్ సిండ్రోమ్ అనే వ్యాధితో బాధ పడుతున్నారని హరీష్‌రావు విమర్శించారు. ఢిల్లీ పర్యటనకి సంబంధించి ఒక రోజు ముందు ఎపికి షాక్ అని లీక్‌లు ఇచ్చి, మధ్యాహ్నం కల్లా బనకచర్ల ప్రాజెక్టు ఎజెండాలో ఉంటే పోయేది లేదు అని చెప్పి, రాత్రి కల్లా పరుగు పరుగున ఢిల్లీకి పోయారని తెలిపారు. నీటి ఒప్పందాల గురించి సిఎం రేవంత్ రెడ్డికి తెలియదని విమర్శించారు. నీటి వినియోగానికి, నీటి పంపకానికి తేడా తెలియదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడితే రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడాలని హితవు పలికారు. ఏం చేసినా కెసిఆర్‌కు ఉన్న ఇమేజ్ రేవంత్ రెడ్డికి రాదు అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి తన ఎత్తు గురించి మాట్లాడతారని, కానీ ఆయన ఏం చేసినా తన అంత ఎత్తు పెరగడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే అసెంబ్లీ పెట్టి తమ మైక్ కట్ చెయ్యకుండా నిజాయితీగా అన్ని అంశాలపైన చర్చించేందుకు బిఆర్ఎస్ సిద్ధం అంటూ సవాల్ విసిరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటున్నారని ఆరోపించారు. కెటిఆర్‌పైన చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించాలని, లేదంటే కెటిఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లోకేశ్‌కు కెటిఆర్ అర్ధరాత్రి పూట కలిశాడు అని రేవంత్ రెడ్డి అంటున్నారు.. ఈ రాష్ట్రంలో అర్ధరాత్రి పూట గోడలు దూకే అలవాటు రేవంత్ రెడ్డికే ఉందని విమర్శించారు. తమ చుట్టూ సిఎం నిఘా పెట్టారని, బిఆర్ఎస్ నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. తమ వెనుక ఇంటెలిజెన్స్ వాళ్ళను పెట్టి ఎక్కడ అంటే అక్కడ తిప్పుతున్నారని తెలిపారు. తాత్కాలిక నీటి ఒప్పందంలో భాగంగా కృష్ణా జలాల్లో ట్రిబ్యునల్ సెక్షన్ 3 సాధించారని చెప్పారు.

# చంద్రబాబు స్క్రిప్టు.. రేవంత్ చిలక పలుకు

కేటీఆర్ ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే బనకచర్ల ప్రాజెక్టు కట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసిందల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఎద్దేవా చేశారు. రాయలసీమ, ఆంధ్రా కూడా బాగుండాలని.. అదే సమయంలో తెలంగాణ నీటి వాటా తేలాలని కేసీఆర్ కోరుకున్నట్లు చెప్పారు. తమకు ఆంధ్రా ప్రజలతో గొడవ లేదని స్పష్టంచేశారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని. కన్నెపల్లిలో మోటార్లను ఆన్ చేస్తే తెలంగాణలో కరువు ఛాయలు ఉండవని అన్నారు.

**డ్రగ్స్ కేసులో ఆధారాలు చూపాలి**

సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో తనపై విషం చిమ్ముతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటి వరకు సంయమనం పాటించానని, ఇకపై ఊరుకోబోనని స్పష్టంచేశారు. డ్రగ్స్ కేసులో తనపై విచారణ జరుగుతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆధారం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 'హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ము లేక ఢిల్లీకి వెళ్లి మరీ రేవంత్‌రెడ్డి నాపై బురద జల్లుతున్నారు. న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నారు. పిరికి దద్దమ్మలా చిట్‌చాట్‌ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఇకపై వీటిని సహించేది లేదు. సీఎం చేసిన నిరాధార ఆరోపణలకు క్షమాపణ చెప్పాలి. డిమాండ్ చేశారు. లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది'అని హెచ్చరించారు.

# ఓఆర్ఆర్ లోపల కల్లు దుకాణాలు బంద్!

రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని మల్కాజి గిరి, మేడ్చల్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలోని కల్లు దుకాణాల ఎత్తి వేతకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కల్తీ కల్లు కారణంగా పది మంది మరణించడం ప్రభుత్వానికి మచ్చగా మారిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**ఓఆర్ఆర్ లోపల 390 సంఘాలు, 454 దుకాణాలు**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల తాటి కో ఆపరేటివ్ సొసైటీలు.. హైదరాబాద్‌లో 14 ఉండగా, వీటి కింద 53 కల్లు దుకాణాలు, సికింద్రాబాద్‌లో 31 సంఘాల పరిధిలో 50 కల్లు దుకాణాలు, రంగారెడ్డి జిల్లాలోని మల్కాజిగిరిలో 77 సంఘాల కింద 79 దుకాణాలు, మేడ్చల్ పరిధిలో 50 సంఘాల కింద 52 కల్లు దుకాణాలు, సరూర్‌నగర్ పరిధిలో 158 సంఘాల కింద 158 దుకాణాలు శంషాబాద్ పరిధిలో 60 సంఘాల కింద 62 దుకాణాలు ఉన్నాయి. మొత్తం 390 సంఘాల కింద 454 కల్లు దుకాణాలు ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం ఈ 454 కల్లు దుకా ణాలను పూర్తిగా ఎత్తేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. దుకాణాల మూతతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న టీఎఫ్‌టీ (ట్రీఫర్ ట్రేడ్) లైసెన్స్‌లు కూడా రద్దు అయ్యే అవకాకాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరో పక్క ఎక్సైజ్, పోలీసులు, టీజీ న్యాబ్, కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ నిఘా సంస్థలు కల్తీ కల్లు తయారుకు వినియోగించే అల్ప్రాజోలమ్, హైడ్రో క్లోరైడ్, డైజో ఫామ్ లాంటి నిషేధిత రసాయనాలను పూర్తిగా అరికట్టలేక పోతుండడంతో ప్రభుత్వం ఓఆర్ఆర్ పరిధి లోపల కల్లు అమ్మకాలను నిషేధించాలని భావిస్తున్నట్లు ఎక్సైజ్ వర్గాలు చెపుతున్నాయి.

# తెలంగాణ హక్కులను బాబు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు: కవిత

హైదరాబాద్: తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు స్పందించకపోవడమనేది దారుణమని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఈ విషయం బిఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నానని, తన దారికి భారత రాష్ట్ర సమితి నేతలు రావాల్సిందేనని స్పష్టం చేశారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. న్యాయ నిపుణులతో చర్చించిన తరువాతనే బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది కూడా తానేనని తెలియజేశారు. బనకచర్లపై చర్చకు వెళ్లనని సిఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, బుధవారం ఢిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల అని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపారని తెలియజేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాలు హక్కులు తెలంగాణ రాష్ట్రం కోల్పోతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదావరి జలాలను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టారని దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న నష్టం గురించి చెప్పడం లేదని కవిత చురకలంటించారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ఏడారిగా మారే అవకాశం ఉందన్నారు. తెలంగాణ హక్కులను చంద్రబాబు నాయుడు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని, దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలించే హక్కులేదని, తక్షణమే రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. గోదావరి రివర్ మెనేజ్‌మెంట్ బోర్డు హైదరాబాద్‌లో ఉంటే కృష్ణా రివర్ మెనేజ్‌మెంట్ విజయవాడలో ఉంటుందని విభజన చట్టంలో ఉందని చెప్పారు. రెండు నదులకు సంబంధించిన బోర్డు విషయంలో రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని చురకలంటించారు. మన భూభాగంలో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రిపేర్లు తెలంగాణ ప్రభుత్వం చేయాలని, ఎపి భూభాగంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ రిపేర్లు చంద్రబాబు ప్రభుత్వం చేయాలని విభజన చట్టంలో ఉందన్నారు. నదులు అనుసంధానం విషయంలో కమిటీలు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చింది ఏమీ లేదని కవిత మండిపడ్డారు.

# బండి సంజయ్‌కు సిట్ నోటీసులు



కరీంనగర్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తొలిసారి వెలుగులోకి తీసుకువచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఎంపీ బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేసింది. కేంద్ర మంత్రితో పాటు పీఆర్వో, పీఏలకూ సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈమేరకు సిట్ విచారణలో హైదరాబాద్ లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌లో స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. అదే రోజు పీఆర్వో, పీఏల స్టేట్‌మెంట్‌ను సిట్ పోలీసులు రికార్డ్ చేయనుంది. ఈ మేరకు కొద్దిసేపటి క్రితం సిట్ అధికారులు కేంద్ర మంత్రి నివాసానికి వెళ్లి నోటీసులు అందించారు.

# మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరువతో కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు 12 కోట్ల 28 లక్షల నిధులు మంజూరు

కుత్బుల్లాపూర్ జులై 17(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కొరకు పార్టీ నాయకులు పలు సమస్యలు మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ లి దృష్టికి తీసుకొనివచ్చిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళి బిటి రోడ్లు,సిసి రోడ్లు, డ్రైనేజీ,చెరువు సుందరికరణ, మౌలిక సదుపాయలకు 12 కోట్ల 28 లక్షలు మంజూరు చేపించడం జరిగింది..

అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఈరోజు దూలపల్లి లోని పలు కాలనీలు, కొంపల్లి ఊరచెరువును కాలినడకన సందర్శించి అక్కడి ప్రజతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. అందులో భాగంగా జిమ్మి దేవేందర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాల్గోని అభివృద్ధి పనులను కొంపల్లి మున్సిపాలిటీ ప్రజలకు తెలియజేసారు..

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్, మున్సిపాలిటీలో దశలవారీగా అభివృద్ధి పనులు చెప్పాడుతామని హామీ ఇచ్చారు. పత్రిక సమావేశం ద్వారా కొంపల్లి మున్సిపాలిటీ ప్రజల తరుపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

70 లక్షలతో పిఎంఆర్ ఎన్క్లేవ్ (నియోలజీస్) నుండి దుర్గా నర్సరీ గార్డెన్స్ ద్వారా చావల వరకు 600%వీవీ% దయా రసీసీ పైప్‌లైన్, కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లోని రాఘవల్ వేర్ హౌసింగ్ ఎదురుగా (ఓపెన్ లేఅవుట్) నుండి పామ్ మెడోస్ గేట్ వరకు ఇన్నోవేటివ్ స్పేస్‌లను క్రాఫ్టింగ్ మంజూరైంది.. కోటి 50 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లో పామ్ మెడోస్ గేట్ నుండి శాంతి నగర్ కాలనీ మీదుగా స్ప్లెండిడ్ అపర్ణ పామ్ అవెన్యూ మరియు సహజ సెరీన్ అపార్ట్‌మెంట్ నుంచి పట్టన ప్రకృతి వనము మీదుగా అపర్ణ సెప్టిక్ ట్యాంక్ వరకు 600%వీవీ% దయా రసీసీ పైప్‌లైన్ మంజూరైంది..



45 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లోని సర్వీస్ రోడ్ వద్ద మికాసా స్టెర్లింగ్ రోడ్డు ద్వారా నోముల నిర్వాణ ద్వారా అపర్ణ పామ్ వరకు %ాఔ+% పైప్‌లైన్ మంజూరైంది.. 43 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.06లో అను ఫర్నిచర్ షాపు నుండి లక్కీ టెంట్ హౌస్ వరకు CC రోడ్డు మంజూరైంది..

5 కోట్లతో కొంపల్లి మున్సిపాలిటీలోని వార్డు నెం.1లోని ఊర చెరువు కట్టను సుందరీకరణ.. 35 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.08లో శ్రీ వేద నిలయం నుండి బాలాజీ విల్లాస్ వయా సాయి హంస నిలయం వరకు వైష్ణో ఎన్క్లేవ్‌కు చేరుకునే రోడ్డు మంజూరైంది..

కొంపల్లి మున్సిపాలిటీలో వార్డు నెం.08లో నారాయణ స్కూల్ ద్వారా SV రెసిడెన్సీని SVC బ్రుందావన్ హైట్స్ వరకు మంజూరైంది..

3 కోట్లతో కొంపల్లి మున్సిపాలిటీలోని పారిశ్రామిక ప్రాంతంలో దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుండి ధనరేఖ నిలయం వరకు %దీ% రోడ్డు మంజూరైంది.. ? 50 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.08లో సంజీవని మెడికల్ షాప్ నుండి విబ్రాంత్ విద్యుత్ అపార్ట్‌మెంట్ నుండి దుర్గా ఎన్క్లేవ్ వరకు సిసి రోడ్డు మంజూరైంది. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కాందడి సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, కౌన్సిలర్ బి.శివ కుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి,మోహన్ రెడ్డి,కావాలి శివాజీ,అంజి ముదిరాజ్, షేక్ ఇబ్రహీం, జయాభేరి గోపాలరెడ్డి,అశోక్ రెడ్డి,పూర్ణచంద్ర రావు, నవీన్ ముదిరాజ్, రాము గౌడ్,రాజేష్ గౌడ్, సాయి యాదవ్, నాగరాజు యాదవ్, డప్పు నరేందర్,కుట శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, చందర్ నాయక్, విజయ్ నాయక్ , రాజశేఖర్ పాటు కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ రాజు నీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, టిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ తదితరుల దృశ్యం. - ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)



## ప్రైవేట్ బస్ డ్రైవర్ పై దాడి చేసిన కేసులో ఐదుగురి అరెస్టు..

### మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన..

శేరిలింగంపల్లి, జులై 17(వాయిస్ టుడే): ట్రావెల్ బస్ డ్రైవర్ పై దాడి చేసిన కేసులో ఐదుగురిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు.. డీ ఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం..కాచిగూడ నుండి రాజస్థాన్ కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్ వెళ్తున్నది..అదే బస్సులో పూనా రామ్(30) ప్రయాణం చేస్తున్నాడు. బస్ మియాపూర్ ఆల్విన్ చౌరస్తా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్దకు చేరుకోగానే బస్ లోపూనా రామ్ సిగరెట్ తాగాడు. దీంతో బస్సులో సిగరెట్ తాగొద్దని డ్రైవర్, క్లీనర్ నచ్చ చెప్పారు. దీంతో బస్ డ్రైవర్ పై పూనారాం దుర్భాషలాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో పూనరాం మరో నలుగురు స్నేహితులను రప్పించాడు. దీంతో వారు వచ్చిరావడంతోనే బస్సు డ్రైవర్ , క్లీనర్ పై దాడి చేయడమే గాకుండా సెల్ ఫోన్ , నగదును ఎత్తుకెల్లారు. దీంతో బస్సు యజమాని మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు దాడికి పాల్పడ్డ ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## చోట మొహరం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మిర్జా రియాజూల్ అఫెండి




జూబ్లీహిల్స్ 17 జులై (వాయిస్ టుడే): సోమాజిగూడ డివిజన్. ఎల్లారెడ్డి గూడ లో చోట మొహరం బుధవారం రోజు న చాలా ఘనంగా నిర్వహించారు..కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మిర్జా రియాజూల్ అఫెండి.. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొహరం చాలా ఘనంగా నిర్వహిస్తామని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం విజయంతో చేస్తున్నారని తెలిపారు.. ఈ కార్యక్రమం నిర్వహించిన ఎంఐఎం అధ్యక్షుడు షేక్ జఫర్.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్లు.. మహమ్మద్ అబ్దుల్ ముజీబ్ హైకోర్టు అడ్వకేట్.. వై నాగేష్ షేక్ మహబూబ్ షేక్ కలీం షేక్ షరీఫ్.. షేక్ ఫరీద్. షేక్ షఫీ.. సయ్యద్ జమీర్..షేక్ సల్మాన్ ఇతరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జులై 17(వాయిస్ టుడే): (కుత్బుల్లాపూర్ నియోజకవర్గం) పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి లి సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000/- , ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) ని మంజూరు చేయించి ఈరోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 125 డివిజన్ శ్రీనివాస్ నగర్ వాసులు కొట్ర కళావతి - రూ . 21,500/-, కె .సింధు - రూ . 37,500/- సీఎంర్ఫ్-మంజూరి పత్రాలను (చెక్కులు) అందజేశారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే చేస్తున్న జిమ్ము గార్డెన్ వర్క్ పరిశీలించిన.. అధికారులు, నార్సింగి మార్కెట్ కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్ జులై 17 (వాయిస్ టుడే): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు.. కమిషనర్ మరియు డి ఈ. ఏ ఈ అంజలీ గార్డెన్ కెఎన్ఎన్ పార్క్ లో జిమ్ము, పిల్లలు ఆడే గ్రౌండ్, మరియు అనేక రకాల పార్కు అభివృద్ధి పనులను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు.. ఈ కార్యక్రమం నార్సింగ్ మార్కెట్ డైరెక్టర్ లక్ష్మి శ్రీ. ఆధ్వర్యంలో నిర్వహించారు.. పాల్గొన్న వార్లు ...అన్వేష్ రెడ్డి భాస్కర్.వినోద్. సమత మాణిక్య రెడ్డి.. మహావీర్. కిరణ్ శ్రీపురం టి వెంకట్.కేఎన్ఆర్ హిల్స్ కాలనీ వాసులు..

## ఎర్రగడ్డ బోనాల పండుగలో పాల్గొన్న కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్ 17 జులై (వాయిస్ టుడే): ఎర్రగడ్డ డివిజన్ లో బోనాల పండుగ సందర్భంగా మహంకాళి ఆలయం లో ప్రత్యేక పూజ చేసిన రహమత్ నగర్ కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి ....

ఈ కార్యక్రమం లో ఎర్రగడ్డ కాంగ్రెస్ నాయకులు గణేష్,ఆకాష్, నాగరాజు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.





ఈ నెల 27 న ఉప్పల్లో బోనాల పండుగ సందర్భంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి రావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని..ఆయన ఇంటి వద్ద కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్య బాలకృష్ణ తదితరుల దృశ్యం.

- ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)

## జిహెచ్ఎంసి పారుశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను పంపిణీ

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ నియోజకవర్గం లోని చిల్కానగర్ డివిజన్ లో కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, డి చందన తో కలిసి పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సేవలు అభినందనీయమని వారు చేసే సేవకు ఎంత పాలిష్ తోషితం ఇచ్చిన తక్కువే అని, శానిటేషన్ సిబ్బంది ఒక్కరోజు లేకున్న హైదరాబాద్ హైదరాబాద్ హస్త వ్యస్తం అవుతుందని వారితో ప్రతి ఒక్కరు కూడా గౌరవంతో మినగాలని కొనియాడారూ. కార్యక్రమంలో సానిటేషన్ సిబ్బంది టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య రక్షణ కిట్టు పంపిణీ చేసిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ డివిజన్లో జిహెచ్ఎంసి సానిటేషన్ సిబ్బందికి స్థానిక ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి రక్షణ కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను నియంత్రణకు చేసే సేవలు మరువలేనివని,రక్షణ కిట్లు రెగ్యులర్గా వినియోగించుకొని విధులు నిర్వహించేటప్పుడు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆమె సూచించారు. డివిజన్లో ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సక్రమంగా పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ చందన, డివిజన్ అధ్యక్షుడు బాకారంలక్ష్మణ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్ గారు, తుమ్మల దేవి రెడ్డిల ప్రభాకర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, అలుగుల అనిల్. అల్వాల్ భాస్కర్,విజయ్, బొడిగె మల్లేష్, మోహన్, ఇతరులు పాల్గొన్నారు.



## మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్ను కలిసిన నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు

నాచారం, జూలై 17( వాయిస్ టుడే): నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కమిటీ సభ్యుల బృందం గురువారం తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో సత్కరించారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనీ ఈ సందర్భంగా దీపక్ జాన్ క్రైస్తవ సంఘ నాయకులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికి అందేలా ఎన్సిసి క్షేత్రస్థాయిలో ప్రచారంలోకి తీసుకెళ్లాలన్నారు. అందుకు ఎన్సిసి నాయకులు సమ్మతించారు. దీపక్ జాన్ను కలిసిన వారిలో ఎన్సిసి తెలంగాణ ప్రసిడెంట్ మద్దెల సంజయ్ ఆనంద్, జనరల్ సెక్రటరీ బక్క ఏలియా, ఉమెన్ వింగ్ వైస్ ప్రసిడెంట్ సిస్టర్ రెబెకా, ఎన్సిసి స్టేట్ ప్యాట్రన్ ఇమ్మానుయేల్ తదితరులున్నారు.

## బస్తీ బస్తీ తిరిగి అధికారులతో కలిసి బస్తి బాట కార్యక్రమం నిర్వహించిన కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి.



జూబ్లీహిల్స్ 17 జులై (వాయిస్ టుడే): రహమత్ నగర్ డివిజన్ లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నిర్వహిస్తున్న బస్తీ బాట లో భాగంగా గురువారం రోజు బంగారు మైసమ్మ టెంపుల్ ఏరియాలో పర్యటించడం జరిగింది. బంగారు మైసమ్మ టెంపుల్ ఏరియాలోని అనేక గల్లీలను తిరుగుతూ అక్కడి సమస్యలను అడిగి తెలుసుకునారు. వాటి పరిష్కార దిశగా అడుగులు వేస్తానని ఆ బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## రెవెన్యూ అధికారులు అక్రమ కబ్జా నిర్మాణం కూల్చివేతలు

జూబ్లీహిల్స్ 17 జులై (వాయిస్ టుడే): ఎర్రగడ్డ సారధి సొసైటీ లో అక్రమాంగా కబ్జా చేసి నిర్మించిన గృహాన్ని ఖైరతాబాద్ తాసిల్దార్ ఆదేశాల మేరకు తొలగించిన రెవిన్యూ అధికారులు..అనిల్ స్పెషగల్ ఆర్ ఐ.. రాజు.. యాదయ్య..



## కనకాల కట్ట మైసమ్మ బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం....**

**ఆలయ చైర్మన్ గౌతమ్ రాజు....**

సికింద్రాబాద్, జూలై 17 (వాయిస్ టుడే ప్రతినిది): ఆషాడం మాస బోనాలు పురస్కరించుకొని ట్యాంక్ బండ్ కనకాల కట్ట మైసమ్మకు ప్రతి ఏడు లాగే ఈసారీ అమ్మవారికి బోనాల జాతర ను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ గౌతమ్ రాజు తెలిపారు. గురువారం కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్యాంక్ బోర్డుపై వెలసిన కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అత్యంత ప్రాచీనమైందన్నారు. ఈ దేవాలయానికి దూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలతో వేలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారని తెలిపారు.

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అమ్మవారి దర్శనం సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి ఆషాడ బోనాల మహోత్సవానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి సాంబశివరావు, ఆలయ పూజారి సాత్విక్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఓయుకు ప్రతిష్టాత్మక ఏసీ ఈ అవార్డు

సికింద్రాబాద్, జులై 17 (వాయిస్ టుడే ప్రతినిధి): పునరుత్పాదక విద్యలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక ఏసీఈ అవార్డు 2025 ను దక్కించుకుంది. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ సర్క్యులర్ ఎకానమీ ఈ అవార్డును ప్రకటించింది. వనరులను పునర్వినియోగం చేసుకోవటం ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ అవార్డును కైవసం చేసుకుంది. పునరుత్పాదనలో అభ్యాస పాఠ్యాంశాల రూపకల్పన, అంతర్గత అధ్యయనాలు, సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పరంగా విశ్వవిద్యాలయం చేపట్టిన వినూత్న ప్రయత్నాలను ఐ సి ఈ ఎఫ్ ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ సందర్భంగా ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. ఏసీఈ అవార్డు అధ్యాపకులు, విద్యార్థులు, భాగస్వాముల కృషికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఓయూలో విద్యార్థులకు పునరుత్పాదక అభివృద్ధి దిశగా మార్గనిర్దేశం చేసే నైపుణ్యాలను అందించడంపై తమ నిబద్ధతను మరింత బలపరుస్తుందని వివరించారు. మహాలక్ష్మి బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా ఓయూలో ప్రాక్టికల్ గా చేపట్టిన పునరుత్పాదక విధానాలు అవార్డు దక్కేందుకు ఉపయోగపడ్డాయి. ఈ సందర్భంగా ఓయూ బయో డైవర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసులును ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ అభినందించారు. ప్రతి రోజూ రెండు టన్నుల ఆహార వ్యర్థాలను ఓయూలో బయో గ్యాస్ గా మార్చి... లేడీస్ హాస్టల్ కు గ్యాస్ అందిస్తున్నారు. ఇదే సమయంలో వెలువడే బయోస్లరీ వర్ధక ఎరువు ను విశ్వవిద్యాలయ ఉద్యానవనాల్లో వాడుతున్నారు. ఈ బయో గ్యాస్ ప్లాంట్ ను కేపీఎంజీ, సాహస్, ఏఈఎస్ సౌజన్యంతో ఓయూలో ఏర్పాటు చేశారు. ఈ అవార్డు ను ఈ నెల 31న రాడిసన్ గురుగ్రాంలో అందించనున్నారు.




## అధికారులతో జిహెచ్ఎంసి సమీక్ష సమావేశం

సికింద్రాబాద్, జులై 17 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో గురువారం జిహెచ్ఎంసి కమిషనర్, వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు (హైడ్రా) కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా నగర శుభ్రత, డ్రైనేజీ సమస్యలు, చెట్టు కొమ్మల తొలగింపు, వర్షపు కాలంలో తక్కువ ప్రదేశాలలో నీటి నిల్వలు వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్లు సూచించారు. ఈ సమావేశంలో పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఓయూ బోధనేతర సిబ్బందికి పదోన్నతులు





సికింద్రాబాద్ జులై 17 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయం 52 మంది బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించింది. అటెండర్ ఉద్యోగుల నుంచి ల్యాబ్ అటెండెంట్ హోదాలకు పదోన్నతులు పొందిన ఉద్యోగులు పరిపాలనా భవన్ లోని సెనెట్ హాల్ లో ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం చేతులమీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. విశ్వవిద్యాలయాల నియమాల ప్రకారం, సమగ్రంగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో నిష్పాక్షికంగా, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతులు తమ వృత్తి జీవితంలో మైలురాయిగా పేర్కొన్నారు. తమ వృత్తిని మరింత నిబద్ధతతో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య ఎస్. జితెందర్ కుమార్ నాయక్, జాయింట్ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 19న జాబ్ మేళా




హైదరాబాద్, జూలై 17: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇది పూర్తి ఉచింగా నిర్వహించడం జరుగుతుందని, జాబ్ మేళాలో పాల్గొనే వారు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పంజాగుట్ట, ద్వారకాపురి కాలనీలోని రాజేశ్వరి టవర్స్ లో 19వ తేదీన శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్: 8179955744.




## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

**టియుజెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి...**

**ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహానికి టియుజేఏసీ వినతి....**



సికింద్రాబాద్, జూలై 17 (వాయిస్ టుడే ప్రతినిది): ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని టియుజెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో టియుజెసి ఉద్యమ నాయకులు ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్బంగా సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమంలో 369 మంది తుపాకి తూటాలకు బలై పోయారని, మలి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారనీ, మిగిలిన ఉద్యమకారులు, శారీరకంగా, వృత్తి రిత్యా ఆర్థిక పరంగా అన్ని రకాలుగా నష్టపోయారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఉద్యమకారులకు అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. తక్షణమే ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 250 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలనీ, ప్రతి నెల 30 వేల రూపాయల (పెన్షన్ గౌరవ వేతనం) ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో టియుజేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా యాదగిరి, గుండమల్ల శ్రీను, మోత్కూర్ మల్లేశం, డోలక్ యాదగిరి, స్వరూప, డి లక్ష్మి, గందమల్ల యాదగిరి, పాండు,కే రాజేంద్ర ప్రసాద్, గిరిపల్లి మల్లేశం, గంగిరాజు, నాచాం శంకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ క్రైమ్ ఏసిపిని కలిసిన మురారి స్మిత

సికింద్రాబాద్, జూలై 17 (వాయిస్ టుడే ప్రతినిది): జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్, ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ ఉమెన్ వింగ్ చైర్మన్ గా మురారి స్మిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం సైబర్ క్రైమ్ ఏసిపి జైపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మురారి స్మితకు శుభాకాంక్షలు తెలిపారు.

## యువకుడు అదృశ్యం...



సికింద్రాబాద్, జూలై 17 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన లాలాగూడు పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... నార్తాగూడలోని ఎన్ఎల్డీడీ-1129 అపార్ట్మెంట్లో నివాసముంటున్న విపుల్(22) అనే యువకుడు బీ-టెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 16న మధ్యాహ్నం 12.30 గంటల ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా కూడా ఇంటికి తిరిగిరాకపోవడంతో విపుల్కు తన కుటుంబసభ్యులు ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నానని చెప్పాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తెలిసిన వారిని, స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు అతగి సోదరుడు విశాల్ స్థానిక లాలాగూడ పోలీసే స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు.



## రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా సుభికషంగా ఉండాలని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు

కూకట్ పల్లి, జులై 17(వాయిస్ టుడే): కూకట్పల్లి నియోజకవర్గం బోనాల జాతర సందర్బంగా పలు డివిజన్లలో బోనాల ఉత్సవాలకు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షులు మరియు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, టెంపుల్ కమిటీ చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్, మహిళ నాయకురాలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల జాతర సందర్భంగా అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఆశీస్సులు ఉండాలని ప్రార్థించా..

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

కూకట్ పల్లి : జులై 17(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ఆషాడమాస బోనాల ఉత్సవాలు పురస్కరించుకుని మూసాపేట్ లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ, పోచమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం కమిటీల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా హాజరై అమ్మవార్లను దర్శించుకుని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఆలయ చైర్మన్ ఆర్కె ఎల్లేష్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గ్రామా దేవతలకు బోనాలు సమర్పించడం దేశంలోనే మనదైన ప్రత్యేకత అని అన్నారు. బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందడం వందల ఏండ్ల నుండి వస్తున్న సంస్కృతిక సంప్రదాయ పరంపర భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని అన్నారు. అమ్మవారి చల్లని దీవెనలతో రాష్టంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరనన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, గాజుల మహేష్ గౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు జోజోమ్మ, ఐఎన్ టియూసి అధ్యక్షులు నరసింహ యాదవ్, తూము మనోజ్, తూము శైలేష్, రాము, టీంకు, తోట రాజు, సప్పిడి భాస్కర్, మల్లేష్ యాదవ్, సప్పిడి వినీత్, కర్రేమ్మ, సప్పిడి జగన్, వినోద్, సంతోష్, అఖిలేష్, శ్రీను, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రెండు లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

## తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు ఎం ఎల్ రాజు గౌడ్....


## సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగుల ధర్నా...



సికింద్రాబాద్, జులై 17 (వాయిస్ టుడే ప్రతినిది): నిరుద్యోగులు జాబ్ నోటిఫికేషన్ కోసం ఎంతగానో ఎదురుచూపులు చూస్తున్నారని, రెండు లక్షల ఉద్యోగాలతో కూడుకున్న జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు ఎంఎల్ రాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీలో ప్ల కార్డులు పట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ రాజు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని, దానిలో గ్రూప్ వన్, గ్రూప్ టు, ఎక్సైజ్ కానిస్టేబుల్, డిఎస్సీ వంటి ఉద్యోగాలు ఏమీ లేవని, ఈ జాబ్ క్యాలెండర్ చెత్త కాగితం తో సమానమని జాబ్ క్యాలెండర్ ప్రతిని చించి వేశారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సరియైన జాబ్ కేలండర్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి అంతా చిన్న చూపా అని మండి పడ్డారు. నిరుద్యోగులతో పెట్టుకుంటే రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు గద్దె దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. 2 లక్షలు ఉద్యోగాలతో డీఎస్సీ, గ్రూప్ వన్, గ్రూప్ టు, ఎక్సైజ్ పోస్టులతో జాబితాలను విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరూ ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దింపుతామన్నారు. ఇప్పటివరకు మీరు మమ్మల్ని తొక్కేసారని, ఇకపై మేము తొక్కడనికి సిద్ధమవుతామన్నారు. పాలకులు నిరుద్యోగులతో రాజకీయం చేస్తే నాయకులే రోడ్లపైకి వస్తారని హెచ్చరించారు. నిరుద్యోగులకు కోపం వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చూపిస్తా మన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిరుద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు మేరకు పోటీ చేస్తామని కాంగ్రెస్కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి నిరుద్యోగులు లైబ్రరీలో చదువుకుంటున్నారని లైబ్రరీలో మధ్యాహ్న భోజనం పెట్టాలని అడుగుతే పట్టించుకునేవారు లేరన్నారు లైబ్రరీలో ఐదు రూపాయల భోజనంలో ఒక్కోసారి నీళ్ల చారు ఉంటుందన్నారు. చదువుకున్న విద్యార్థులు బలవర్ధకమైన పోషకాహారం తినాలన్నారు. రాజకీయ నాయకులు లక్షల కోట్లు సంపాదించుకుంటున్నారన్నారు విద్యార్థులు డబ్బుతో పోషకాహారం తింటున్నారని సుఖంగా ఉంటున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలంటే పట్టించుకోరా అని మండిపడ్డారు. ముందుగా సిటీ సెంటర్ లైబ్రరీ నుండి సమీపంలోని హనుమాన్ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించాలనుకున్న విద్యార్థులు, ర్యాలీని మానుకొని సిటీ సెంటర్ లైబ్రరీ ప్రహరీలోని స్థలంలో ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు ఇన్స్పెక్టర్ రాజు నాయక్ ఎస్ఐలు మౌనిక శివప్రసాద్ లు సిబ్బందితో మోహరించి, విద్యార్థులు ధర్నా నిర్వహించడానికి ప్రత్యేకమైన స్థలాలు ధర్నా చౌకు ప్రదేశాలు ఉన్నాయని అక్కడ ధర్నాలు నిర్వహించాలని లైబ్రరీలో చదువుకునే విద్యార్థులకు వీటి వల్ల ఇబ్బంది కలుగుతుందని వెంటనే విద్యార్థులు ధర్నాను విరమించి లైబ్రరీ ఆవరణ వదిలి వెళ్లాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలి

## ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం రోజు కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో అన్ని మండలాల స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమీషనర్ లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ ఇందిరమ్మ ఇండ్లపై దృష్టి పెట్టాలన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టిన ఇండ్లు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కట్టుకునే వాళ్లకి మట్టి, ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రగామి గా ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకుతెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని అధికారులను కోరారు. ఒక్కో మండలం వారీగా కేటాయించిన లబ్ధిదారుల ఇండ్ల మంజూరీ చేసిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను ఆరా తీశారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రౌండింగ్ విషయంలో వెనుకంజలో ఉన్న మండలాలను గుర్తించి, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని విప్ సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు. బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వారికి ప్రతి సోమవారం లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జడ్పీ సీఈఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,హౌసింగ్ పీడీ విజయసింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

## - ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ మరియు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు.గురువారం రోజు ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఆలేరు నియోజగవరంలోని ఆలేరు పట్టణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వై ఎస్. ఎన్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు పాల్గొన్నారు.ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమం మొదలుపెట్టిన ముందుగా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు చేయడమే ముఖ్యమంత్రి ఆలోచన అని అందుకు ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమానికి మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చాక మహిళలకు అనేక రంగాలలో ముందు ఉంచామని, మహిళలకు వడ్డీ లేని రుణాలు, నియోజకవర్గంలో 50 శాతం ఐ. కే. పి సెంటర్ లు కూడా మహిళల కే ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చిన మొదటిలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. మహిళలకు 200 ఉచిత కరెంట్, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇచ్చి మహిళలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మహిళల అభివృద్ధి చేయడంలో భాగంగా పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. కరెంటు ఉత్పత్తి అయ్యేందుకు సోలార్ పవర్ ప్లాంట్లు మహిళలకు ప్రభుత్వమే భూమి ఇచ్చి అలకేషన్ చేసి మహిళలను చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. మహిళా సంఘాలు బలోపేతం చేయడానికి గతంలో 18 నుంచి 20 సంవత్సరాలు ఉంటే ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు 15 నుంచి 62 సంవత్సరాల వరకు సభ్యత్వం ఇస్తున్నామన్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే 10 లక్షలు మహిళలకు ప్రమాద బీమా కింద ఇవ్వడం జరుగుతుంది అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదనే ఇచ్చామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అతి పేద రికం తో ఉంటే మహిళా సంఘాల ద్వారా లోన్ లు ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకెళ్తున్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వెంటనే లక్ష రూపాయలు ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, తదుపరి పిల్లర్ లెవెల్,స్లాబ్ లెవెల్ పూర్తయిన తర్వాత డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. ఇల్లు త్వరగా పూర్తి చేసుకున్న వారికి గృహప్రవేశానికి నూతన వస్త్రాలు పెట్టి గొర్రె పొట్టేలు ఇస్తున్నానని అందుకు లబ్ధిదారులు త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ నెల్లకంటి సత్యం మాట్లాడుతూ... ప్రభుత్వం వచ్చాక మహిళల కోసం అనేక పథకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు.జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ... ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఇంత ఘనంగా నిర్వహించుకుంటున్నామంటే మహిళలకే ప్రభుత్వం అన్ని రంగాలలో అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. అన్ని రంగాలలో మహిళలనుభాగస్వామ్యం చేస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళలు కాంట్రాక్టర్ గా మారి నిర్మాణాలు చేపట్టారన్నారు. పలు అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్, పెట్రోల్ బంకులు, అద్దె బస్సులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి సంక్షేమ పథకాలు మహిళలకు ఇవ్వడం నిదర్శనం అని అన్నారు.స్వయం సహాయక సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ఫ్ ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.మహిళ సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాలు :: 1,44,20,489/- చెక్కును,స్వయం సహాయక సంఘ సభ్యురాల నామిని (కటికల కిష్టయ్య ) కు ప్రమాద బీమా రూ: 10,00,000లక్షల చెక్కును,ఆలేరు నియోజకవర్గం మహిళా సభ్యులకు బ్యాంకు రుణాలు:: 51,77,26,000/- చెక్కును,మహిళా సంఘ సభ్యులకు లోన్ బీమా క్లెయిమ్స్: 11,53,008/- గల చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొన్న తెలంగాణ మున్నూరు కాపు మహా సభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు

కూకట్ పల్లి, జులై 17(వాయిస్ టుడే): ఆషాడ మాసం బోనాల జాతర సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్ లో గాంధీ బొమ్మ దగ్గర ఉన్న ఆలయం లో సప్పిడి వంశీయుల ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలలో తెలంగాణ మున్నూరు కాపు మహా సభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సప్పిడి వెంకటేష్, సప్పిడి భాస్కర్, సప్పిడి జగన్, సప్పిడి వినోద్, సప్పిడి వినీత్, సప్పిడి సంతోష్, సప్పిడి అఖిలేష్, తదితరులు ఉన్నారు




## అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భువనగిరి/యాదగిరిగుట్ట (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో అగ్నిమాపక కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఎమ్మెల్సీ నెలకంటి సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంత రావు ప్రారంభించారు. అగ్నిమాపక పోలీసులు అందజేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఆ తర్వాత అగ్నిమాపక వాహనాలను, పనిముట్లు, పరికరాలు, మిషన్లను పరిశీలించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ..ఎక్కడ ప్రమాదం జరిగిన విపత్తులు ఎదురైన మొదటగా స్పందించే శాఖ అగ్నిమాపక శాఖ, ఈ అగ్నిమాపక శాఖ ఉన్న పేరును 2009 లో రాష్ట్ర విపత్తులు స్పందన , అగ్నిమాపక శాఖగా పేరు మార్చారు. ఇటువంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో ఇలాంటి భవనాన్ని డొనేట్ చేసిన పలు సంస్థలకు అభినందనలు తెలిపారు. తమ సంస్థ సంపాదించిన దాంట్లో విపత్తుల సమయంలో ప్రాణాలకు ప్రాణంగా పెట్టి పోరాడే వారికి ఇలాంటి భవనం నిర్మించి ఇవ్వడం సంతోషకరమన్నారు.



## ఆలేరులో బస్సు నడిపిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఆలేరు బైపాస్ రోడ్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య బస్సు నడిపారు.ఆలేరు మండలంలో పలు గ్రామ ప్రజల కోరిక మేరకు కూకట్ పల్లి డిపో కు చెందిన ఆర్ టి సి బస్ ను జగద్గిరిగుట్ట నుండి ఆలేరు, బహుద్దూర్ పేట, మంతపురి, దిలావర్ పూర్, ఇక్కుర్తి, శర్భనాపురం, మటూర్, అమ్మనబోల్, గోలనుకొండ మీదుగా జీడికల్ వరకు ఏర్పాటు చేశారు. దీంతో బస్సు నడిపి ఆ రూట్ లో సేవలను ప్రారంభించారు.దీంతో డిపో మేనేజర్ హరికి శాలువా కప్ప ఈ కార్యక్రమంలో డిపో మేనేహార్ హరి, సి ఐ శ్రీలత, ఏ డి సి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మహిళ శక్తి సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గురువారం రోజు ఇందిరమ్మ మహిళ శక్తి సంబరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎమ్మెల్సీ నేలికంటి సత్యం జిల్లా కలెక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన, చేసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహిళా సంఘ సభ్యులకు వడ్డీలేని రుణాల పంపిణీ చెక్కును అందజేశారు, మహిళా సంఘ సభ్యులకు బ్యాంకు రుణాల చెక్కును, వివిధ బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరి చెక్కును అందజేశారు.

